1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

శనివారం | జులై 13, 2024 | www.navatelangana.com

పోసానిపేటలో కుక్కల దాడి

- ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-రామారెడ్డి



మండలంలోని పోసానిపేటలో కుక్కల బెడదతో ఇద్దరికీ శుక్రవారం గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కుక్కల బెడద తీవ్రంగా ఉందని ఓ యువతితో పాటు, పాఠశాల విద్యార్థినిపై కుక్కలు దాడి చేయడంతో, స్వల్ప గాయాలతో ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. అధికారులు, విడిసి కమిటీ చొరవ తీసుకొని గ్రామంలో కుక్కల బెడద నివారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

20న బోధన్‌లో ఊర పండుగ

నవతెలంగాణ-బోధన్

ప్రతి సంవత్సరం లాగే ఘనంగా నిర్వహించే ఊర పండగను ఈ సంవత్సరం కూడా బోధన్ గ్రామ పెద్దలు ఈనెల 20వ తేదీన ఊర పండుగను ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం గ్రామ దేవతలకు ముడుపు వేసి పండగ క్రతువును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పండుగను ఘనంగా నిర్వహించడానికి అన్ని కులసంఘాల ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని పేర్కొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు పండాలని, ఎలాంటి రోగాలు వ్యాప్తిచెందకుండా ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో జీవించాలని కోరుతూ ఊర పండుగను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కావున బోధన్ ప్రజలు ఊర పండుగ నియమ, నిబంధనలను అనుసరించి మెలగాలని సూచించారు. కార్యక్రమంలో బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు బాగారెడ్డి, కొంద్ర వెంకటి, గుమ్మల అశోక్‌రెడ్డి, వీరపురం పోశెట్టి, రామకృష్ణ, సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పాలనలో దోమల బెడద

- మంచం పట్టిన సంగెం
- పట్టించుకోని అధికార ఘనం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

గ్రామపంచాయతీ ప్రత్యేక పాలనలో దోమల బెడద అధికమైంది. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యవేక్షణ లేకపోవడం నిధులు కేటాయించకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. వాతావరణ మార్పులు, తరచూ వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించి దోమలు విజృంభించడంతో డెంగ్యూ, విషజ్వరాలతో పలువురు మంచం పడుతున్నారు.

నసురుల్లాబాద్ మండలంలో గత కొన్ని రోజుల నుంచి దోమలు జనంపై దండయాత్ర చేస్తున్నాయి. దీంతో మండలంలోని సంగెం గ్రామంలో జనాలు రోగాల పాలైతున్నారు. దోమల బెడదతో సంగెం గ్రామానికి చెందిన కొందరికి డెంగ్యూ సోకడంతో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. చికిత్స కోసం లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. గ్రామంలో దోమల బెడదతో ప్రజలు అల్లాడుతున్నారు. ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణ కోసం ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా ప్రయోజనం ఉండడం లేదు. పారిశుధ్యం క్షీణించడంతో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఫలితంగా ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. పగలు, రాత్రి తేడాలేకుండా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. శీతాకాలంలో సాధారణంగా వచ్చే శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు దోడు దోమకాటుతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. చీకటి పడితే చాలు రోడ్లపై కొద్దిసేపు నుంచోవాలంటేనే దోమల దెబ్బకు భయపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పగటి వేళల్లో కూడా దోమల దాడితో ప్రజలు అల్లాడిపోతున్నారు. దోమల బెడదతో చిన్నాపెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ రోగాల బారిన పడుతున్నారు. వీధులు, మురుగుకాల్వలు చెత్తాచెదారాలతో అపరిశుభ్రంగా మారుతున్నాయి. డ్రెయిన్లు పూడికతో పేరుకు పోతుండగా, ఖాళీ స్థలాలు చిట్ట అడవిలను తలపిసున్నాయి.



ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను

వెంటనే విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కామారెడ్డి కలెక్టరేట్ ముట్టడి
- గేటు ముందు బైఠాయించి ఆందోళన నిర్వహించిన నాయకులు
- నిజామాబాద్‌లో ప్లేట్‌లతో నిరసన



కామారెడ్డి: కలెక్టరేట్ కార్యాలయాన్ని ముటకటడించిన ఎస్ఎఫ్ఐ నాయకులు



కంఠేశ్వర్: అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి/కంఠేశ్వర్

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో శుక్రవారం ముట్టడించారు. అనంతరం గేటు ముందు బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముదాం అరుణ్, ఎస్ అజయ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సుమారు 8 వేల కోట్లకుపైగా స్కాలర్షిప్‌లను, ఫీజు రియింబర్స్మెంట్‌ను పెండింగ్‌లో పెట్టి విడుదల చేయకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా స్కాలర్‌షిప్‌లను పెండింగ్‌లో పెట్టిందని, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా విడుదల చేస్తది అనుకుంటే విద్యార్థులకు మొండిచేయి చూపుతుందని అన్నారు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లను ఇవ్వకపోవడం వల్ల విద్యార్థుల సర్టిఫికెట్ల కోసం కాలేజీ యాజమాన్యాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. సంవత్సరానికి 14 లక్షలమంది విద్యార్థులు స్కాలర్షిప్లకు అప్లై చేసుకుంటున్నారని సంవత్సరానికి 3000కోట్ల చొప్పున మూడు సంవత్సరాలకు సుమారు తొమ్మిది వేల కోట్ల వరకు పెండింగ్‌లో పెట్టడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రవేశపెట్టిందని, ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడం శోచనీయమని అన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని లేనియెడల అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.మణికంఠ, నాయకులు రాహుల్, నితీన్, రాఘవ, ప్రభు, అర్జున్, సాయి పాల్గొన్నారు.

పెండింగ్‌లో స్కాలర్‌షిప్స్‌ను విడుదల చేయాలి..

కంఠేశ్వర్ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ తక్షణమే విడుదల చేయాలని స్థానిక ధర్నాచౌక్ వద్ద ప్లేట్‌లతో నిరసన తెలియజేసి అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విఘ్నేష్ మాట్లాడుతూ.. గత ఆరేళ్ళ నుంచి విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజులను ప్రభుత్వం చెల్లించడంలేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంవత్సరానికి 14లక్షల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని వివరించారు. వీరికి సంవత్సరానికి రూ.3000 వేల కోట్లు అవసరం అవుతాయని, కానీ 2019 నుంచి ఇప్పటి వరకు బకాయిలు పేరుకుని ఉన్నాయన్నారు. 2019-2020 (800 కోట్లు), 2020-2021 (2356 కోట్లు), 2021-2022 (2100.43 కోట్లు), 2022-2023 (2958.14కోట్లు) మొత్తం (8214.57 కోట్లు) ఫీజుల బకాయిలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం విద్యార్థులు ఆందోళనలు చేసినప్పుడు టోకెన్లు జారీ చేయడం తప్ప ట్రెజరీల నుండి ఒక్కరూపాయి కూడా నిధులు విడుదల చేయడం లేదని తెలిపారు. ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజులు రాలేదనే పేరుతో విద్యార్థులకు సర్టిఫికేట్స్ ఇవ్వడంలేదని తెలిపారు. తక్షణమే పెండింగ్ ఉపకార వేతనాలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దీపిక, జిల్లా నాయకులు విశాల్, సతీష్, రాజు, అజాద్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- కమ్యూనిటీ హెల్త్ సెంటర్, పాఠశాలలు తనిఖీ

నవతెలంగాణ-వర్ని



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ప్రభుత్వ ఆసుపత్రులకు ఎంతో నమ్మకంతో వచ్చే నిరుపేదలు, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించి, సర్కారు దవాఖానాల పనితీరుపై మరింత నమ్మకాన్ని పెంపొందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వైద్యాధికారులు, సిబ్బందికి హితవు పలికారు. శుక్రవారం ఆయన వర్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. 30 పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలోని రిజిస్ట్రేషన్ కౌంటర్, అవుట్ పేషంట్, ఇన్-పేషంట్ విభాగాలు, వివిధ వార్డులను సందర్శించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఆరోగ్య మేళా సందర్భంగా అందిస్తున్న ప్రత్యేక వైద్య చికిత్సలు, మధుమేహం, రక్తపరీక్షలు చేస్తున్న తీరును పరిశీలించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు సగటున ఎంతమంది రోగులు వస్తారు, ఎంతమంది ఇన్ పేషెంట్లుగా చేరుతున్నారు, స్థానికంగానే కాన్పులు చేస్తున్నారా అని వైద్యులను ఆరా తీశారు. సాధారణ ప్రసవాలను స్థానికంగానే చేస్తున్నామని, హైరిస్క్ కేసులను బోధన్‌లోని జిల్లా ఆసుపత్రికి, నిజామాబాద్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నామని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. రోగులను పలుకరించి వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. వైద్యులు అందుబాటులో ఉండడం లేదని పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తన వెంట ఉన్న జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా గల అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది అందరూ తప్పనిసరిగా సమయపాలన పాటించేలా పర్యవేక్షణ చేయాలని, ప్రజలకు సంతృప్తికర స్థాయిలో సేవలందేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి..

పాఠశాలల్లో మౌలిక వసతులను పెంపొందించేందుకు చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన వర్ని మండలంలోని శ్రీనగర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, సత్యనారాయణపురంలోని ప్రభుత్వ బాలికల జెడ్పి హైస్కూల్‌ను సందర్శించారు. నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులతో పాటు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. తుది దశలో మిగిలి ఉన్న పనులను సైతం నాణ్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు పంపిణీ జరిగిందా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, పాఠశాల ఆవరణను చదును చేయించి మొరం వేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, డీఈఓ ఎస్.వీ.దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న యూనియర్ జిల్లా గౌరవాధ్యక్షులు రమేష్‌బాబు

అంగన్వాడీ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం తగదు

- యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు రమేష్‌బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంగన్వాడీ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం తగదని యూనియన్ జిల్లా అధ్యక్షులు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం 7వ రోజు ధర్నాచౌక్‌లో జరుగుతున్న నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ.రమేష్ బాబు పాల్గొని సంఘీభావం తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీ ఉద్యోగులకు 65 సంవత్సరాలు నిండిన వారిని జూలై 1వ తేదీ నుంచి విధుల్లోకి రాకూడదని ప్రభుత్వం ఆదేశించింది. జీవో నెంబర్ 10ని ఉపసంహరించుకొని గత ప్రభుత్వం ఇచ్చిన హామీని టీచర్‌కు 2లక్షలు, ఆయాకు లక్ష రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇచ్చి వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని తెలిపారు. గత వారంరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా రిలే దీక్షలు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం వృద్ధాప్యంలో కూడా అంగన్వాడీలను నిర్లక్ష్యం చేయటం సరైంది కాదన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని 30, 40 సంవత్సరాల వరకు అనేక మంది పిల్లలకు సేవలందించడంతో పాటు అనేక ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయటానికి సహకరించిన వారిని చివరి దశలో ఇబ్బందులు పెట్టటం భవ్యం కాదన్నారు. గత ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేయకుండా దాటవేయడంతో వారికి తగిన గుణపాఠం చెప్పే పరిస్థితి ఏర్పడ్డదని నేటి ప్రభుత్వం వారి సమ్మె సందర్భంగా తాము అంగన్వాడీలను ఆదుకుంటామని సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చి ఇప్పుడు పట్టించుకోకుండా వదిలేయడం మూలంగా ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే రిటైర్డ్ అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని లేని ఎడల ఆందోళనను ఉధృతం చేయాల్సి వస్తుందన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ అంగన్వాడీ ఉద్యోగులు కళావతి, సావిత్రి, లక్ష్మి జరీనా, రిటైర్డ్ ఉద్యోగులు తదితరులు, పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై

యాక్షన్‌ప్లాన్ తయారు చేయండి

- మున్సిపల్ కమిషనర్‌ను కోరిన సభ్యులు

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ

కామారెడ్డి పట్టణంలో తాగునీటి సమస్యపై యాక్షన్‌ప్లాన్ తయారుచేసి నీటి సమస్య లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ సభ్యులు కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశపు హాల్‌లో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సాధారణ సమావేశంలో సభ్యులు మిషన్ భగీరథ నీటి సరఫరా 10 ఎంఎల్‌డి బదులు 3 ఎంఎల్‌డి సరఫరా చేస్తునట్లు కౌన్సిల్ సభ్యులు సభాదృష్టికి తీసుకోచ్చారు. పారిశుధ్య సమస్య, ఎంక్రోచ్‌మెంట్ విషయంలో అభ్యంతరం తెలిపారు. చైర్‌పర్సన్ కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్, కౌన్సిల్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ తాగునీటి సమస్యపై అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. సెల్ పరిధిలో అక్రమ కట్టడాలు నిర్మిస్తే వాటిని పోలీస్ సహాయంతో తీసివేయాలని, అనుమతి లేకుండా భవన నిర్మాణం చేపట్టినట్లైతే నిర్మాణం చేపట్టకముందు నిలుపుదల చేయాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా నీరునిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ 100 శాతం చేయాలన్నారు.

రోడ్లకు ఇరువైపులా చెత్త కుప్పలు లేకుండా చూడాలని, ఒకవేళ ఏమైనా రోడ్డుపైన చెత్తవేస్తే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎన్ఎం, ఆశావర్కర్స్‌తో శుక్రవారం కార్యక్రమాన్ని చేపట్టాలని, కొత్తగా మొక్కలు నాటి, ప్రతి ఇండ్లలో మొక్కలు నాటేందుకు సరఫరా చేయాలన్నారు. కౌన్సిల్ వారి సహకారంతో ఇంటి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్, ప్రకటన పన్నులతో ఆదాయం పెంచుకోవాలని అన్నారు. కౌన్సిల్ మీటింగ్‌లో కౌన్సిల్ వారిని ఉద్దేశించి పై సూచనలు ఆదేశాలు జారీచేశారు. ఈ సాధారణ సమావేశంలో 25 అంశాలకు గాను ఒక అంశము (12వ అంశము) వాయిదా వేశారు. మిగతా అంశాలకు ఆమోదం తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన పనులు తీసుకోకూడదని తీర్మాణం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, కామారెడ్డి, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉరుదొండ్ల వనిత రవి, కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ సుజాత కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు.

దుర్కిలో గంజాయి పట్టివేత

నవతెలంగాణ-నసురుల్లాబాద్



నసురుల్లాబాద్ మండలంలోని దుర్కి వద్ద గురువారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఒకే వ్యక్తి వద్ద నుంచి 100 గ్రాముల గంజాయిని నసురుల్లాబాద్ ఎస్ఐ లావణ్య పట్టుకున్నారు. ఈ కేసు విచారణకై బాన్సువాడ సిఐ సత్యనారాయణ నసురుల్లాబాద్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ దుర్కి గ్రామంలో వాహన తనిఖీలో లభ్యమైన గంజాయి నిందితుడు గంజాయి ఎక్కడ కొనుగోలు చేసాడు. ఎక్కడ విక్రయిస్తున్నాడు అనే కోణంలో విచారణ చేస్తున్నామని సిఐ తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి రేపు కేసు పూర్తి వివరాలు తెలియపరుస్తామన్నారు. అలాగే యువత మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు చూడాలని, గంజాయి తాగిన వ్యక్తి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ముందే అడ్డుకట్ట వేయాలన్నారు.

సీజ్ చేసిన ఎరువుల బస్తాలు సొసైటీకి అప్పగింత

నవతెలంగాణ-రెంజల్

ఇటీవల రెంజల్ సొసైటీ పైన నమోదైన కేసులో రూ.53,330 జరిమానా విధించినట్లు వ్యవసాయ శాఖ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ డబ్బులను రెంజల్ సింగిల్ విండో చెల్లించడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సొసైటీ సీఈఓ వై.రాముకు 1170 బస్తాలను తిరిగి అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఈతవనాలు నాటిన ఎక్సైజ్‌శాఖ అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండలం బాగేపల్లి బేబీ కుంట గట్టున శుక్రవారం ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఈతవనం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎక్సైజ్ శాఖ సిఐ, ఎస్సైతో పాటు, సిబ్బంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక గౌడ నాయకులు, రెంజల్ గౌడ సంఘం మండలాధ్యక్షులు సాయిబాబాగౌడ్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, సాయ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ

విద్యుత్ అధికారులకు సన్మానం


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని డివిజన్ విద్యుత్ ఆఫీస్ కార్యాలయం నందు డిఈ హరిచంద్ అధ్యక్షతన డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఏఈ, ఏడిఏలతో నిర్వహించిన ఈ సమీక్ష సమావేశంలో మే 2024 నెలలో ఉత్తమ ఏడిఏగా కంపెనీ స్థాయిలో ద్వితీయ స్థానం సంపాదించిన జనార్ధన్ శ్రీధర్ కంపెనీ స్థాయిలో ఉత్తమ ఏఈగా మూడో స్థానంలో నిలిచిన ముప్కాల్ ఏఈ తొాము రవిని డివిజన్ ఆఫీస్‌లో సన్మానించారు. ప్రతి నెల విద్యుత్ సంస్థలో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించిన చక్కటి పనితీరు కనబరిచిన వారికి కంపెనీ ప్రతినెల ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ సూపర్వైజర్ అవార్డును అందుకున్న సత్యనారాయణ


అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి విధులు నిర్వర్తిస్తున్న చింత సత్యనారాయణ బెస్ట్ సూపర్వైజర్ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని బెస్ట్ సూపర్వైజర్ అవార్డును జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ అందజేశారు. విధి నిర్వహణలో తన సేవలను గుర్తించి అవార్డు అందించిన అధికారులకు, అవార్డు కోసం ఎంపికకు కృషి చేసిన ఆర్మూర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రమేష్‌కు సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

పారదర్శకంగా 'మహిళా శక్తి' లబ్ధిదారుల ఎంపిక

- వివక్షకు తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పష్టీకరణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహిళా శక్తి కార్యక్రమం ద్వారా వివిధ యూనిట్ల స్థాపన కోసం పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో వివక్షను ప్రదర్శిస్తూ పొరపాట్లకు ఆస్కారం కల్పిస్తే, సంబంధిత ఏపీఎంలను బాధ్యులుగా పరిగణిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో శుక్రవారం మహిళా శక్తి కార్యక్రమంపై జిల్లా, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులకు, డీపీఎంలు, ఏపీఎంలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా శక్తి కార్యక్రమం ఉద్దేశ్యాన్ని కలెక్టర్ వివరిస్తూ.. మహిళలను ఆర్థికంగా మరింత ప్రగతిబాటలో పయనింపజేయాలనే సంకల్పంతో ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ఇప్పటికే పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టి ఇచ్చే బాధ్యతలతో పాటు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల్లో పనులను సైతం స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారానే కొనసాగిస్తోందని గుర్తు చేశారు. జిల్లాలో సుమారు లక్షా 80 వేల యూనిఫామ్స్ కుట్టే బాధ్యతలను మహిళా సంఘాలకు అందిస్తున్నామని, తద్వారా ఒక్కో జత కుట్టుకూలీ 75 రూపాయలు చొప్పున మహిళా సంఘాలకు సుమారు కోటిన్నర రూపాయల వరకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. భవిష్యత్తులోనూ వీరికి అంగన్వాడీ సెంటర్లు, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ లు కుట్టించే ఆర్డర్లు కూడా అందిస్తామని అన్నారు. రెండవ జత ఏకరూప దుస్తులను త్వరితగతిన అందించేలా చూడాలని మహిళా సమాఖ్య ప్రతినిధులకు సూచించారు. కాగా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళా సంఘాల్లో ఔత్సాహిక సభ్యులకు వారి అభిరుచికి అనుగుణంగా వివిధ యూనిట్ల స్థాపన కోసం ఎంపిక చేసే ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని కలెక్టర్ ఏపీఎంలను ఆదేశించారు. ఆసక్తి, అభిరుచి, నైపుణ్యత, స్థానిక మార్కెట్ పరిస్థితులు వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని సభ్యులను ఎంపిక చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని మహిళా స్వయం సహాయక సంఘాలు, వాటిలో కొనసాగే ఔత్సాహిక సభ్యులకు ప్రయోజనం చేకూరేలా చూడాలని హితవు పలికారు. త్వరితగతిన యూనిట్ల గ్రౌండింగ్ కోసం చొరవ చూపాలని, ప్రతి యూనిట్ విజయవంతంగా కొనసాగేలా, తద్వారా మహిళా సాధికారత సాధించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా అంకిత భావంతో కృషి చేయాలని అన్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి విమర్శలు, ఫిర్యాదులకు తావులేకుండా మహిళా శక్తి కార్యక్రమం జిల్లాలో విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో మహిళా సంఘాల సభ్యులను కలిసి, వారికి ఏ రంగంలో ఆసక్తి ఉంది, స్థానికంగా మార్కెట్ స్థితిగతులను అధ్యయనం చేసి వివిధ యూనిట్ల స్థాపన కోసం బ్యాంకు రుణాలు ఇప్పించడం, నాణ్యమైన ఉత్పాదకత, మార్కెటింగ్ వంటి వాటికి తోడ్పాటును అందించాలని అన్నారు. యూనిట్లు నెలకొల్పిన తరువాత కూడా క్రమం తప్పకుండా వాటి పనితీరును పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం తొలివిడతగా మంజూరు చేసిన యూనిట్లను లక్ష్యానికి అనుగుణంగా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయించి, విజయవంతంగా నిర్వహిస్తే, వచ్చే ఏడాది మరింత పెద్ద ఎత్తున జిల్లాకు యూనిట్లు మంజూరయ్యేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని మహిళా శక్తి కార్యక్రమాన్ని ఆషామాషీగా భావించకుండా, లబ్ధిదారుల ఎంపిక, యూనిట్ల స్థాపన, ఉత్పత్తుల మార్కెటింగ్ తదితర అన్ని అంశాలపై పూర్తిస్థాయిలో దృష్టిసారించి, మహిళలు ఆర్థికాభివృద్ధి దిశగా ముందడుగు వేసేలా ఏపీఎంలు చిత్తశుద్ధితో పని చేయాలని అన్నారు. వచ్చే వారం మలివిడత సమావేశం నిర్వహిస్తామని, సమగ్ర వివరాలతో రావాలని సూచించారు. క్షేత్రస్థాయిలో తాను కూడా యూనిట్లను పరిశీలిస్తానని, ఎక్కడైనా లోపాలుంటే ఏపీఎంలపై చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. కాగా, మహిళా సంఘాల సభ్యులు సైతం మహిళా శక్తి కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, తమ అభిరుచికి తగిన యూనిట్లను ఎంచుకుని వ్యాపార దక్షత, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుని లాభాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. మొదటి విడత లబ్ధిదారులు విజయవంతంగా యూనిట్లను నడపగలిగితే, వారిని స్ఫూర్తిగా తీసుకుని మిగతా మహిళా సభ్యులు కూడా ఉత్సాహంగా ముందుకు వస్తారని అన్నారు. అందరూ మూస ధోరణిలో ఒకే రకమైన యూనిట్లను కాకుండా, మార్కెట్ డిమాండ్, తమతమ నైపుణ్య అభిరుచికి అనుగుణంగా యూనిట్లను ఎంచుకుని పూర్తి శక్తిసామర్థ్యాలతో నిర్వహించి ఆర్థిక పురోగతి సాధించాలని సూచించారు. అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీఓ సాయాగౌడ్, లీడ్ బ్యాంకు మేనేజర్ సి.అశోక్ చౌహన్, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి జగన్నాథ చారి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సురేష్ కుమార్, ఫిషరీస్ ఏ.డీ రాజనర్సయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు


పాల్గొన్న అధికారులు

తొర్లికొండ పాఠశాలకు క్రీడా సామాగ్రి వితరణ


విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలం తొర్లికొండ జిల్లా పరిషత్ హై స్కూల్‌కు క్రీడాసామగ్రిని వితరణ చేశారు. తొర్లికొండ పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తొర్లికొండ వాస్తవ్యులు జిల్లా బేస్ బాల్ సంఘం అధ్యక్షులు ఎల్. మధుసూదన్‌రెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం, జిల్లా వాలీబాల్ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్ గౌడ్ పాఠశాల క్రీడాకారులకు 10వేల విలువగల క్రీడాసామాగ్రిని అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి, మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ పాఠశాలలో క్రీడ స్ఫూర్తిని పెంపొందించడానికి విద్యార్థులకు అవసరమైన క్రీడ సామాగ్రిని ఇవ్వడానికి ఎల్లవేళలా తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ.. తొర్లికొండ పాఠశాలకు క్రీడా సామాగ్రిని ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా మీ సహాయ సహకారాలతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సింగారం గంగా జమున, మాజీ ఉపసర్పంచ్ ఈర్ల భూమేష్, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడడం మన బాధ్యత

- ఏసీపి బస్వారెడ్డి


మొక్కలు నాటుతున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పర్యావరణాన్ని కాపాడటం మన అందరి బాధ్యత అని ఏసీపి బస్వారెడ్డి, సీనియర్ అడ్వకేట్ భూపతిరెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీ సరస్వతీ విద్యా మందిర్ పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. సీనియర్ అడ్వకేట్ మాట్లాడుతూ.. పాఠశాల ప్రారంభంలో భవన నిర్మాణానికి తమ వంతుగా చేసిన సహాయ సహకరాలను గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ తమపుట్టిన రోజుకో లేదా పండుగ సందర్భంగా అయినా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఏసిపి మాట్లాడుతూ.. మొక్కలు నాటడంవల్ల పర్యావరణాన్ని కాపాడిన వాళ్ళం అవుతామని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి మంచి భవిష్యత్తుకోసం విద్యా బుద్ధులను నేర్వాలని, సమాజ శ్రేయస్సుకు పాటు పడాలని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ రవినాథ్, ప్రభంద కారిణి కమిటీ అధ్యక్షులు వంశీ, సెక్రటరీ మహేష్, వైస్ ప్రెసిడెంట్ జనార్ధన కిరణ్, పాఠశాల పూర్వ విద్యార్థులు, పాఠశాల ప్రిన్సిపాల్ వినోద్ కుమార్, ముద్ర కోల, మేనేజ్మెంట్ అభిమన్యు, మాతాజీ, శైలజ, సోనాలి, శ్రీ విద్యా, సింధుజ, లత, వేద, నిహారిక, అంజలి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నలంద పాఠశాలలో ఫాదర్స్‌డే సెలబ్రేషన్


పోటీలో పాల్గొన్న చిన్నారులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంద ప్రీ స్కూల్‌లో శుక్రవారం ఫాదర్స్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ పిల్లల ఉజ్వల భవిష్యత్‌లో తండ్రి కీలక పాత్ర ఉంటుందని అన్నారు. సమాజంలో ఉండే మంచి చెడుల వ్యత్యాసం గురించి వివరిస్తారని, వారి పిల్లల భవిష్యత్ ఉన్నతంగా ఉండటానికి తాను కష్ట పడుతుంటాడని తెలిపారు. ప్రిన్సిపల్ సాగర్ మాట్లాడుతూ.. పిల్లల అభివృద్ధి తండ్రి ఆధ్వర్యంలోనే మొదలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మొదట విద్యార్థులు వారి ఫాదర్స్‌ను పరిచయం చేశారు. తర్వాత పిల్లలకు, ఫాదర్స్‌కు ఆట పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సెలబ్రేషన్స్‌లో పిల్లలు, తండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రీస్కూల్ ఉపాధ్యాయులు అరుంధతి, శ్రావణి, నవనీత, మమత, జ్యోతి, అపూర్వ, విద్యార్థులు పాటశాల యాజమాన్యం పాల్గొని విజయవంతం చేశారు.

ఆర్డీఓ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు, బాధితులు

నవతెలంగాణ-ఆర్మూర్

నందిపేట మండలం తల్వేద గ్రామానికి చెందిన బొమ్మెన పెద్ద పెద్దన్న పై దాడి చేయించిన సాయిరెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని, కేసు నుండి పక్క దారి పట్టించడానికి పోలీసులు కాలయాపన చేస్తున్నారని సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉండారం మోహన్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి మోతే మాట్లాడుతూ.. నందిపేట్ మండలం తల్వేద గ్రామానికి చెందిన మాదిగ బొమ్మెన పెద్ద పెద్దన్న పొలంలో నుండి దారి కావాలని 9 గజాలు కొన్నామని, అందులో కాకుండా బొమ్మన పెద్దన్న పొలంలో నుండి దారి వేయాలని అక్కడ రైతులను ప్రేరేపించి అమలాపురం సాయిరెడ్డి బొమ్మన పెద్ద పెద్దన్నపై దాడి చేయించడం సిగ్గుచేటని అన్నారు. ఇదే దారే విషయంలో 2003లో పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చినప్పటికిని అప్పుడు ఎస్సీ ఎస్టీ కేసు ఆరుగురుపై నమోదు చేయడం జరిగిందన్నారు. అందులో సాయిరెడ్డి కూడా ఉన్నాడని, ఆ కేసును విచారణ చేయకుండా నోటీసు ఇవ్వకుండా క్లోజ్ చేయడం జరిగిందని ఏసీబీ చెప్పారని అన్నారు. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని బొమ్మెన పెద్ద పెద్దన్న యొక్క పొలం ఎండిపోవాలని, పంట వేయద్దని బోరులో రాళ్లతో నింపి పైపులు కోసేసి తగలబెట్టారన్నారు. బొమ్మన పెద్దన్న తనకు ప్రాణహాని ఉంవని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికిని పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. ఈ విషయం మాట్లాడదామని గవ్వల పోతన్నతో సాయిరెడ్డి పిలిపించి బొమ్మన విపరీతంగా పొలంలో కొట్టి బురదలో వేసి ఎముకలు విరిగే విధంగా పొట్టి దాడి చేయటం జరిగిందన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బుక్ చేసి నలుగురిని జైలుకు పంపారని తెలిపారు. కానీ దీనంతటికీ కారణమైన ఎస్సీ, ఎస్టీ కేసు చేయకుండా సాయి రెడ్డి నీ కేసు నుండి పక్కదారి పట్టించడానికి పోలీసులు కాలయాపన చేస్తున్నారని అన్నారు. వెంటనే సాయి రెడ్డిని ఎస్సీ, ఎస్టీ, అంటెంటు మర్డర్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని అన్నారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం డివిజన్ నాయకులు కుతాడి ఎల్లయ్య, ఇడగొట్టి సాయిలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, నిర్మల్ జిల్లా మురళి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కొండ గంగాధర్, బి.రవి, ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మోతే భూమన్న, రాష్ట్ర ఎమ్మార్పీఎస్ మహిళా అధ్యక్షురాలు పోసాని, సుధాకర్ ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ టౌన్ అధ్యక్షుడు రూరల్ ఇన్చార్జ్ రవీందర్, ఇంచార్జ్ మార్క్ నర్సింగ్, అనిత, పద్మ, బొమ్మెడ పోసాని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

- 31లోపు మార్కుల మెమో, బయోడేటా అందించాలి


మాట్లాడుతున్న సంఘం సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పైబడిన కోర్సుల్లో 80 శాతానికిపైగా మార్కులు పొందిన విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం ఆధ్వర్యంలో స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ప్రతిభా పురస్కారాలు అందజేయడం జరుగుతుందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాస్టర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం సుభాష్ నగర్ కార్యాలయంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాస్టర్ శ్రీనివాసరావు, నిజామాబాద్ జిల్లా ప్రతినిధులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ విద్యార్థినిలకు ప్రతిభా పురస్కారాలకు అర్హులైన వారు సుభాష్ నగర్ కార్యాలయంలో ఈనెల 31లోపు మార్కుల మెమో, బయోడేటాను అందజేసినట్లయితే వాటిలో నుండి ఎంపిక చేసి తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఇతర వివరాలకు 9848490055, 98493 91493 నెంబర్లకు సంప్రదించాలన్నారు. జిల్లా స్థాయిలో కూడా ప్రతిభా పురస్కారాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం నిజామాబాద్ ప్రతినిధులు అయినటువంటి రాష్ట్ర నాయకులు కాలేరు గడ్డం శ్రీనివాస్, మయావర్ సాయిరాం,నగర అధ్యక్షులు గంగోనే గంగాధర్ బిజెపి, జిల్లా అధ్యక్షులు భోనేకర్ భూమయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడుకోలు



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని చింతలూరు గ్రామంలో పదోన్నతులు, బదిలీలపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతలూరు నుండి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రముఖులు ఘనంగా సన్మానించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతలూరు నుండి మొన్న జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగ పదోన్నతి పొంది వేరే పాఠశాలలకు వెళ్లిన జయలక్ష్మి, రమాదేవిని ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. 13 సంవత్సరాల కాలంగా ఉపాధ్యాయులు పాఠశాలకు అందించిన సేవలను కొనియాడారు. పీఏసీఎస్ చైర్మన్ నాగుల శ్రీనివాస్ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. తాజా మాజీ సర్పంచ్ పుప్పాల సుకన్య ప్రసాద్ ఉపాధ్యాయుల సేవలను పాఠశాల ఉన్నతిలో వారి పాత్రను కొనియాడారు. ఉపాధ్యాయులను శాలువా జ్ఞాపికలతో ఘనంగా సన్మానం చేశారు. బదిలీ, పదోన్నతులపై వెళ్లిన ఉపాధ్యాయుడు బాలకృష్ణ, ప్రసాద్, ఉపాధ్యాయులు, జయలక్ష్మి రమాదేవి విద్యార్థులందరికీ ఒక జత స్కూల్ యూనిఫామ్‌కు రూ.15వేలు ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా వారి ఔన్నత్యాన్ని విద్యార్థుల పట్ల వారికి ఉన్న ప్రేమ శ్రద్ధలను పాఠశాల ఉపాధ్యాయ బృందం కొనియాడారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ ఏవో లక్ష్మి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంట అశోక్, ఉపాధ్యాయులు నరసయ్య, రాజేందర్, గంగారం, బలిరాం, శ్రీనివాస్, ఉమాదేవి, సంజీవ్ కుమార్, పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

గ్యారెంటీలపై అస్లెంబీలో ప్రశ్నిస్తాం

- నిధులకోసం నిలదీస్తాం
- బిజెపిఎల్‌పి సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

బిజెపిఎల్పి సమావేశం హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరై తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ఈ నెల 24 నుండి జరగనుండటంతో బిజెపిఎల్పి ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి అధ్యక్షతన, సీనియర్ లీడర్ రాజసింగ్ ఆధ్వర్యంలో బిజెపి తెలంగాణ శాసనసభ్యులు సమావేశమైనట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు 420 గ్యారంటీల్లో ఇప్పటివరకు ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చని కాంగ్రెస్ మొండి వైఖరిని అసెంబ్లీలో ప్రశ్నించేలా, బిజెపి ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో అభివృద్ధికి ఒక్కరూపాయి కూడా కేటాయించని రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ సర్కార్ ను అసెంబ్లీ సాక్షిగా నిలదీసే విధంగా చర్చించనున్నట్టు తెలిపారు. జాబ్ క్యాలెండర్ వేసి నియామకాలు చేపడతానని, ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్ నియామకాల గురించి రూ.2 లక్షల వరకు రుణమాఫీ, ఎకరానికి రూ.15వేలు పెట్టుబడి సాయం, కౌలు రైతులకు రూ.15వేలు ఆర్థిక సాయం, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు ఆర్థిక సహకారం అందిస్తామని, రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తామని శాసనసభ ఎన్నికల సమయంలో చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ నిర్లక్ష్య వైఖరిని ప్రశ్నించే విధంగా, రేవంత్ సర్కార్ ఏడునెలల్లో చేసిన అవినీతి, గత ప్రభుత్వం కేసీఆర్‌తో దోస్తిని బట్టబయలు చేసేవిధంగా, రాష్ట్రంలో ప్రశ్నించే వారిపై నిర్బంధలు అక్రమ కేసులు గాడి తప్పిన పోలీస్ వ్యవస్థ వంటి అంశాలపై నిలదీయనున్నట్టు తెలిపారు. ప్రజా సమస్యలు అసెంబ్లీలో లేవనెత్తి రేవంత్ సర్కార్ ప్రజావ్యతిరేక విధానాలను ఎండకట్టే విధంగా పలు అంశాలపైన చర్చించామన్నారు.

కళాశాలను తనిఖీ చేసిన డీఐఈవో


మాట్లాడుతున్న డీఐఈవో

నవతెలంగాణ-మాక్లూర్

మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్య అధికారి రవి కుమార్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలలో 2023-24 విద్య సంవత్సరం పరీక్షల ఫలితాలపై సమీక్షించారు. అలాగే 2024-25 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల సంఖ్య ఆశించిన మేరకు లేనందున విద్యార్థుల చేరిక కోసం ఇంకా అధ్యాపకులు, సిబ్బంది ప్రతి గ్రామంలో పదవ తరగతి పాసైన విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అలాగే అధ్యాపకుల పనితీరు, గత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు వచ్చిన మార్కులు, పాస్ పర్సెంటేజీలపై ప్రతి అధ్యాపకుని అడిగి తెలుసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో మరిన్ని మంచి ఫలితాలను సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆదేశించారు.

అలాగే ప్రభుత్వ కళాశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, లైబ్రరీలు, ప్రయోగశాలల నిర్వహణ, మూత్రశాలలు, మరుగుదొడ్లు, మంచినీటి వసతిపై ప్రజలకు అవగాహన కల్పించి ఇంటర్ ఉచిత విద్యను పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అందించేందుకు కృషి చేయాలని అన్నారు. అలాగే కళాశాల కార్యాలయ సిబ్బంది పని తీరుపై సమీక్షించారు. ఈ సమావేశాల్లో ప్రిన్సిపాల్ గంగారాం, కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. కేసు నుండి పక్క దారి పట్టించడానికి పోలీసులు కాలయాపన చేస్తున్నారు.

ఘనంగా సంతోషిమాత వార్షికోత్సవం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ఆలయ 39వ వార్షికోత్సవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హెూమా కార్యక్రమాలు, అభిషేకాలు చేశారు. ఆలయానికి వచ్చేభక్తుల కొరకు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు నాగరాజు, సంఘం అధ్యక్షులు నాగరాజు, ప్రతినిధులు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజమౌళి, సంఘం సభ్యులు శ్రీనివాస్, శ్రీరాములు, రవి తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్మిషన్ బిచ్కుంద ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత సేవాసంస్థ ద్వారా మండల కేంద్రంలోని బేగంపూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్మిషన్ కౌన్సిలర్ ముఖేష్, రవి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో బ్యాంకింగ్ గురించి, పొదుపులు ఎలా చేయాలో వివిధ బ్యాంకుల డిపాజిట్, బ్యాంకు ఖాతా లావాదేవీలు, బీమా, పెన్షన్ పథకాలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ వినియోదారుల రక్షణ, ఫిర్యాదు, సైబర్ క్రైమ్ ఆర్థిక మోసాలకు గురికాకుండా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.



మాట్లాడుతున్న పలువురు

పాఠశాలలో పారిశుధ్యం లోపించొద్దు

- విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి
- మండల ప్రత్యేక అధికారి రాజు

నవతెలంగాణ-లింగంపేట్

పాఠశాలలో పారిశుధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రాజు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కోర్పోల్, మెంగారం కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. కోర్పోల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని, వర్షాలు పెరగడంతో పారిశుధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించారు. కోర్పోల్ పాఠశాలలో నీటి కులాయి వద్ద నీరు నిలవకుండా చూడాలని కార్యదర్శులు సూచించారు. అదేవిధంగా పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా పాఠశాలలో పౌష్టికాహారం, విద్యాబోధన ఉచిత దుస్తులు తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ శర్మ, సుధాకర్, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ వాసంతి, సీసీ మెహర్, శ్రావణ్, స్వప్న, గ్రామ సంఘం అధ్యక్షురాలు భాగవ్వ, భూలక్ష్మి, వీవోఏ పోశెట్టి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి రాజు

లచ్చన్‌లో దళితుల ఆధ్వర్యంలో బోనాల పండుగ



బోనాలతో వస్తున్న మహిళలు

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని లచ్చన్ గ్రామంలో శుక్రవారం ఆటపాట బాజాభజంత్రీలతో దళితులంతా భక్తిశ్రద్ధలతో ఘనంగా బోనాల పండుగను జరుపుకున్నారు. ప్రతి సంవత్సరం ఆషాడమాసంలో గ్రామ దేవతలకు గ్రామంలో గల దళితులంతా బోనాల పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతూ వస్తుందని ఆ గ్రామస్తులు తెలిపారు. ప్రజలకు గ్రామ దేవతలు సుఖసంతోషాలతో ఉండాలని పాడి పంటలు బాగా పండాలని కోరారు. ఈ బోనాల పండుగ లచ్చన్ గ్రామంలో దళితులంతా సంతోషంగా ఘనంగా జరుపుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను వెంటనే పరిష్కరించాలి



మాట్లాడుతున్న టీఎస్‌వీఎస్ జిల్లా అధక్షులు

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ నవనిర్మాణ విద్యార్థి సేన (టిఎన్‌వీఎస్) జిల్లా అధ్యక్షులు కొత్మీర్‌కార్ వినయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా ఇప్పటివరకు విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందజేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థి సేన తరుపున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థిసేన జిల్లా నాయకులు రాకేష్, సాయిరాం, అసిఫ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ముఖ్య సలహాదారును కలిసిన కాంగ్రెస్ నాయకులు



సీఎం ముఖ్య సలహాదారును కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు వేంనరేందర్‌రెడ్డిని కాంగ్రెస్ మండల నాయకులు, మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డితో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మండల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, నిధులు కేటాయించాలని కోరగా, సానుకూలంగా స్పందించినట్లు మోహన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జుక్కల్ మాజీ జెడ్పిటిసి సాయి ప్రదీప్, బట్టు తాండ మాజీ సర్పంచ్ రెడ్డినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిని గుంజుకొని చంపేస్తామని బెదిరింపు

- భార్య కుమారులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ-పిట్లం

సభ్యసమాజం తలదించుకునేలా కట్టుకున్న భార్య రక్తం పంచుకుని పుట్టిన కుమారులు ఆస్తిని గుంజుకొని రోడ్డుపాలు చేసి చంపివేస్తామని బెదిరిస్తున్నారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఓ తండ్రి ఆవేదన భార్య, కుమారులు ఆస్తిని గుంజుకుని చంపివేస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని శుక్రవారం పోలీస్ స్టేషన్లో ఓ తండ్రి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం.. తాను మండల కేంద్రంలోని పిట్లం గ్రామానికి చెందిన మంచి రవికుమార్ 1993 సంవత్సరంలో లింగంపేట్ మండల కేంద్రానికి చెందిన రోజాతో పెండ్లయ్యింది. ఇద్దరు కుమారులు ఉండగా.. భార్యతో తరచూ గొడవలు చోటుచేసుకున్నాయి. 2009లో ఇద్దరూ బోధన్ సేషన్ కోర్టులో విడాకులు తీసుకున్నాను. కాగా నాటి నుండి ఆమె తల్లి లింగంపేట్‌లోనే ఉంది. విడాకుల అనంతరం కుల పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించగా చిన్న కుమారుడు (సూర్య) నా వద్ద ఉంటానని అతనే స్వయానా ఒప్పుకున్నాడు. నా పెద్ద కుమారుడు (రంజిత్) అమ్మ రోజా దగ్గర ఉంటానని ఒప్పందం జరగడంతో భార్య పెద్ద కుమారుడు లింగంపేట్ వెళ్లిపోయారు. చిన్న కుమారుడు నావద్దే ఉంటాననడంతో నాకున్న 133 గజాల ఇంటి స్థలానికి నేను నా చిన్న కుమారుడిపైన జాయింట్ రిజిస్ట్రేషన్ చేశాను. ఆ స్థలంలో నా పేరు మీద ఎస్‌బీఐ బ్యాంకులో 12లక్షల గృహరుణం తీసుకొని మూడంతస్తుల భవన నిర్మాణం చేయగా 2018లో నా పెద్ద కుమారుడు పిట్లంకు వచ్చి నా చిన్న కుమారుని లింగంపేట్ తీసుకెళ్లి నాలుగు సంవత్సరాల పాటు అక్కడే ఉంచుకొని అతనికి మాయమాటలు చెప్పి నేను పిట్లంలో లేని సమయంలో అక్రమంగా దౌర్జన్యంగా భార్య ఇద్దరు కుమారులు ప్రవేశించారని తెలిపారు. దీంతో 2003లో నాభార్య కుమారులతో ప్రాణహాని ఉందని 100కు డయల్ చేయడంతో స్పందించిన పోలీసులు వచ్చి సర్ది చెప్పినప్పటికీ వారిలో మార్పు రాకపోవడంతో ఎటు తోచక జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయటంతో బాన్సువాడ సీఐ కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ వారిలో ఎలాంటి ప్రవర్తన మారలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం నా భార్య ఇద్దరు కుమారులు నన్ను నా ఇంటి నుండి వెళ్లిపొమ్మని లేదా చంపి వేస్తామని బెదిరించడంతో మానసిక ప్రశాంతత లేకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్న నా భార్య , కుమారులపై చట్టరీత్య చర్యలు తీసుకుని నా ఇంటిని నా పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి న్యాయం చేయాలని పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఫిర్యాదు కాపితో బాధితుడు

బీసీ సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-దోమకొండ

ఈనెల 14న కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కళాభారతిలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సాంబ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీసీ సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో బిసి డిక్లరేషన్ ఇచ్చినందున, ఇక్కడి నుంచే బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో యాత్రను ప్రారంభించినట్లు వారు తెలిపారు. బీసీ కుల గణన చేపట్టిన తర్వాతే స్థానిక ఎన్నికలను నిర్వహించాలన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం కులగణన జరిగిందని తెలిపారు. కులగణన జరిగితే బీసీలకు ఖరారయ్యే రిజర్వేషన్ల ద్వారా పూర్తి న్యాయం జరుగుతుందని వివరించారు. రాజకీయాలకతీతంగా బీసీ సామాజిక వర్గాలు ఆదివారం ఉదయం జరిగే యాత్ర సదస్సుకు వేలాదిగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు అబ్రబోయిన స్వామి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్ హైస్కూల్‌లో వనమహోత్సవం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవంలో భాగంగా బీర్కూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బసవరాజ్ పటేల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బసవరాజ్ పటేల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలన్నారు. ఇందులో భాగంగా పాఠశాలలో మొక్కలు నాటినట్టు తెలిపారు. వన మహోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని, ప్రభుత్వ కార్యాలయంలో ఖాళీస్థలాల్లో మొక్కలు నాటి ప్రకృతిని పరిరక్షించాలని, కాలుష్యాన్ని నియంత్రించాలని ఇది అందరూ సామాజిక బాధ్యతగా తీసుకొని మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకన్న, మాజీ ఎంపీటీసీ పోగు నారాయణ, నాయకులు అబ్దుల్ అహ్మద్, మొగులయ్య, పోతుల వెంకటేశం, నాగరాజు, కుతాడి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



భూమిని పరిశీలిస్తున్న పోలీసులు

ఫారెస్ట్ భూమి విషయంలో గొడవ

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని సోమారం తండాకు చెందిన జన్నుబాయి అనే రైతుకు ఫారెస్ట్ భూమి కంపార్ట్మెంట్ 754 నందు మూడు ఎకరాల ఫారెస్ట్ పట్టా భూమి ఉంది. ఈ భూమిని అటవీ అధికారులు సైతం ధ్రువీకరించారు. గత 20 రోజుల క్రితం ఈ భూమిలో మొక్కజొన్నలు వేయగా.. గురువారం అర్ధరాత్రి సమయంలో కొత్త బాది తండాకు చెందిన 50 నుండి 60 మంది కలిసి 5 నుండి 6 ట్రాక్టర్లతో ఆ భూమి మొత్తం మాదే అని దౌర్జన్యంగా అర్ధరాత్రి సమయంలో దున్ని పూర్తిగా పంట నష్టం చేశారు. జన్నుబాయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నోట్ బుక్స్, వాటర్ బాటిల్స్, పెన్నులు పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్, వాటర్ బాటిల్స్, పెన్నులు అందజేసిన మల్లికార్జు, రవి

నవతెలంగాణ-బోధన్

మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం దాతలు మల్లికార్జున్, రవి విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, నోట్‌బుక్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు బోధన్ డివిజన్ ఇంచార్జ్ ఎంబెల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సహాయం చేయాలనే లక్ష్యంతో ఈ సేవా కార్యక్రమాలను చేశారని, వారు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు ఆదుకోవాలని కోరారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సూర్య కుమార్, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, పిఆర్టియు మండల ప్రధాన కార్యదర్శి ధనరాజ్, పాఠశాల ఉపాధ్యాయ బృందం ఉమారాధ, వీరేష్‌బాబు, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

పోచారాన్ని కలిసిన దళిత సంఘం నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి ఉమ్మడి మండల దళిత సంఘాల నాయకులు మాజీ స్పీకర్, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఆయన నివాస గృహంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నిజామాబాద్ ఉమ్మడి జిల్లా మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిని సైతం మర్యాద పూర్వకంగా కలిసినట్లు దళిత సంఘాల నాయకులు మండల మాలమహానాడు అధ్యక్షులు మీర్జాపూర్ చిన్న సాయన్న పేర్కొన్నారు. కలిసిన వారిలో మాల మహానాడు ఉపాధ్యక్షులు తిర్మలాపూర్ కాలే సాయిలు, కోటగిరి ఉమ్మడి మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బెగరి రాములు, గాయక్వాడ్ రాము తదితరులు పాల్గొన్నారు.

సమాచార చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ అజ్మల్ ఖాన్

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమాచార హక్కు చట్టం 2005 ఇటీవలే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలపైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలపైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ అజ్మల్ ఖాన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా, సహా చట్ట పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం పాల్గొని నేటి రోజుల్లో విద్యార్థిని విద్యార్థులకు విద్యతోపాటు వివిధ చట్టాలపైన అవగాహన ఎంతైనా అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా సహా చట్ట పరిరక్షణ కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ సాదిక్ అలీ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ఒక వజ్రాయుధమని అన్నారు. అలాగే సమాచారం కోసం దరఖాస్తు విధానాన్ని సెక్షన్ 6(1), మొదటి ఆపీల్ రెండవ ఆపిల్‌ల గురించి వివరించారు. ఈ చట్టం ద్వారా భారతీయ పౌరులందరూ ప్రభుత్వ కార్యాలయంలో జరిగే పనులు ఖర్చులు వదలకు పబ్లిక్ డాక్యుమెంట్‌ల గురించి సమాచారాన్ని 30 గడువులోగా తీసుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా మాడూరి శ్రీనివాస్, సలహాదారులు జిల్లా ఉపాధ్యక్షులు వెంకంపల్లి రాజేందర్, జిల్లా స్పోక్స్‌పర్సన్ న్యాయవాది ఈ.శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి

నవతెలంగాణ-గాంధారి

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని నెరల్ గ్రామంలో చోటుచేసుకుంది. మండలంలోని నేరేల్ గ్రామానికి చెందిన హరిజన నవీన్ (27) అనే యువకుడు గురువారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో తన ఇంట్లో ఫ్యాన్ తిరుగకపోవడంతో స్టూలు వేసుకుని రిపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు చేతి వేలికి కరెంట్ షాక్ తగలడం వల్ల పక్కనే ఉన్న గోడపై పడి తలకు తీవ్ర రక్త గాయం కావడంతో వెంటనే అతన్ని గాంధారి రాజమౌళి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి ఆయన అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. మృతుని తల్లి హరిజన్ యాదమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి ఇంకా వివాహం కాలేదు.

ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన డీపీవో నాగరాజ్



మొక్కలు నాటుతున్న డీఐపీవో నాగరాజ్

నవతెలంగాణ-జుక్కల్

ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో డీఐపీవో నాగరాజ్ శుక్రవారం ఎంపిడివో శ్రీనివాస్, సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మఆదర్శ పాఠశాలలో భాగంగా చేసిన ఏఏపీ పనులను పరిశీలించారు. వంటగదిని తనిఖీ చేశారు. వండిన ఆహార పదార్థాల నాణ్యతను విద్యార్థినీలకు అడిగి తెలుసుకున్నారు. విద్యావిధానంలో ఎమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాలులో ఐకేపీ, ఉపాధిహామీ, సమావేశం నిర్వహించి చేస్తున్న పనుల పురోగతిపైన, గ్రామాల అభివృద్ధిపైన దృష్టి సారించాలని, రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని డీఐపీవో నాగరాజ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఐపీవో నాగరాజ్, ఎంపీడీవో శ్రీనివాస్, సిబ్బంది గంగాధర్, మారుతీ పటేల్, భూమాగౌడ్, టీఏ రమేష్, ఐకేపీ సిసిలు తదితరులు పాల్గొన్నారు.

సాటాపూర్ గ్రామ కార్యదర్శికి వినతి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామంలో బస్టాండ్ లేక నానా అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్తులు శుక్రవారం కార్యదర్శి మహబూబ్ అలీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఆసియా ఖండంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన సాటాపూర్ సంతకు మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు రావడం జరుగుతుందని, ఇక్కడ బస్టాండ్ ఏర్పాటు చేసినట్లయితే వ్యాపారస్తులతో పాటు, విద్యార్థులకు గ్రామస్తులకు సౌకర్యంగా ఉంటుందని వారు వినతిపత్రంలో కోరారు. బోధన్ శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు బస్టాండ్ నిర్మాణానికి ముందుకు రావాలని వారు కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మండలాధ్యక్షులు లచ్చేవార్ నితీన్, కంఠం గంగారాం, సడక్ సాయిలు, బుడ్డోళ్ల సాయిలు, కోసం పెద్ద సాయిలు, భాస్కర్ తదితరులున్నారు.

సొసైటీ భూమి ఆక్రమణకు గురికాకుండా కాపాడాలి

- ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న పిఏసిఎస్ సొసైటీ నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండల పరిధిలోని 11వ వార్డు లింగారెడ్డిపేట్ శివారులో గల సర్వేనెంబర్ 692/ఆ, 695/ఆ లో గల పిఏసిఎస్ సొసైటీ భూమి ఆక్రమణకు గురవుతుందని శుక్రవారం పిఏసిఎస్ ఉపాధ్యక్షులు ఎం.ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లింగారెడ్డిపేట్ సొసైటీ కార్యాలయం దగ్గర సంఘానికి సంబంధించి 16 గుంటల స్థిరాస్తి భూమి ఉందని, దానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ దస్తావేజు పత్రాలు కూడా ఉన్నప్పటికీ ఈ భూమి ఆక్రమణకు గురవుతుందన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లి లిఖితపూర్వకంగా విన్నవించినా ఫలితం లేదని, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. సొసైటీ కార్యాలయం ఉన్న స్థలానికి మాత్రమే ప్రహరీ గోడ నిర్మించడానికి సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింలు ప్రయత్నిస్తున్నారని, దీనివల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆరోపించారు. ఆ భూమి సర్వే చేయించి సంఘానికి సంబంధించిన భూమి హద్దులను పూర్తిస్థాయిలో నిర్ధారించిన తర్వాతే ప్రహరీ గోడ నిర్మాణ పనులు చేపట్టే విధంగా తగిన చర్యలు తీసుకొని రైతుల సంఘం స్థిరాస్తి కాపాడి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గోపికృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెన్నులక్ష్మణ్, చింతల శంకర్, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-లింగంపేట్

సైబర్ నేరాలపై కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థినీలకు శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యార్థినీలకు షీటీం గురించి, సైబర్ నేరాల గురించి, మానవ అక్రమ రవాణాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల టోల్ ఫ్రీ నెంబర్ 1930 గురించి బాధితులు పై నెంబర్‌కు ఫిర్యాదులు చేసుకోవచ్చునని వారు సూచించారు. మహిళల సంరక్షణకై షీటీం ఉందని 8712686094 నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అమాయక ప్రజలు సైబర్ నేరాలకు గురికావొద్దు అన్నారు. ఈ కార్యక్రమానికి కళాబృందం సభ్యులు, పిఎస్ సిబ్బంది, ఏఎస్‌ఐ రంగారావు, పాఠశాల ప్రిన్సిపాల్ వాసంతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్థిక సహాయం అందజేత



యువతరం యూత్ ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని ఇందల్‌వాయి గ్రామానికి చెందిన గుజ్జరి వెంకట్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న గ్రామంలోని యువతరం యూత్ ఆధ్వర్యంలో 20,500 నగదు అర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు. గుజ్జరి వెంకట్‌కి ఆరోగ్యం బాగా లేక గత పది రోజుల నుండి నిజామాబాద్ లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికే 6 లక్షల వరకు ఖర్చు చేయడం జరిగిందని, వెంకట్ కుటుంబానికి ఆర్థిక సహాయంగా యువతరం యూత్ సభ్యులు 20,500 అందజేసినటు తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య



మృతి చెందిన శ్రవణ్‌కుమార్

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని నర్సింగ్ కళాశాల సమీపంలో ఓ యువకుడు కుటుంబ కలహాలతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని ఘటన శుక్రవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని అమ్రాద్ గ్రామానికి చెందిన పులా శ్రవణ్ కుమార్ (36) కుటుంబ కలహాలతో వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మండల కేంద్రంలోని నర్సింగ్ కళాశాల సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని కుళ్లిపోయిన శవం లభ్యమైంది. మృతునికి ఇద్దరు పిల్లల లు ఉన్నారు. శవాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వినియోగదారుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న సమన్వయ సమితి సభ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వినియోగదారుల రక్షణ చట్టాన్ని సక్రమంగా అమలు చేయడానికి కృషి చేయాలని నిజామాబాద్ ఇందూరు వినియోగదారుల సమన్వయ సమితి సభ్యులు కోరారు. హనుమకొండలో శుక్రవారం ఇందూర్ వినియోగదారుల సమన్వయ సమితి కార్యవర్గ కమిటీ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు డాక్టర్ "పల్లెపాడు దామోదర్‌ని కోరారు. నిజామాబాదు లో ఆహార కల్తీ, అక్రమ మైనింగ్, తూనిక, కొలతలు, మోసాలు, అదే విధంగా చిటఫండ్ కంపెనీల మోసాలపై కానీ, రియల్ ఎస్టేట్ మోసాలపై గాని ప్రవేట్ పాఠశాలల్లో అధిక ఫీజు వసూలు, వినియోగదారుల మోసాలపై దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల అధ్యక్షులు డాక్టర్ పల్లెపాడు దామోదర్ సహకరించాలని కోరారు. ఈ క్రమంలో వినియోగదారుల సంఘాల ప్రక్షాళన గ్రామ గ్రామాన వినియోగదారుల చైతన్య కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఆహార కల్తీపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి సంబరాజు చక్రపాణి, ఇందూరు వినియోగదారుల సమైక్య సమితి అధ్యక్షులు అనిల్ కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శులు గైని రత్నాకర్, మహాదేవ శ్రీనివాస్ కలిసారు.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-నిజాంబాద్ సిటీ

గ్రూప్-1 మెయిన్స్ పోటీ పరీక్ష శిక్షణ కోసం జూలై 19 లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి కె.కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ గ్రూప్-1 మెయిన్స్ పోటీ పరీక్షల కోసం మైనార్టీ కులాల అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించుటకు నోటిఫికేషన్ జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులను అర్హులైన జిల్లా మైనార్టీలు (ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బుద్ధులు, జైనులు, పార్శీలు) తమ దరఖాస్తులను జూలై 19లోగా తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ మూడవ అంతస్తు, జామియా నిజామియా కాంప్లెక్స్, గన్ ఫౌండ్రి, హైదరాబాద్ నందు సమర్పించాలని తెలిపారు. జూలై 22 నుండి శిక్షణ తరగతులు తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, హైదరాబాద్ నందు ప్రారంభమవుతాయని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 040-23236112 ఫోన్ నెంబర్ నందు కార్యాలయ పని వేళలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి కె.కృష్ణవేణి పేర్కొన్నారు.

టీయూ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయాన్ని ముట్టడించిన విద్యార్థులు



మాట్లాడుతున్న విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయాన్ని పీజీ విద్యార్థులు ముట్టడించారు. ఈ నెల 15నుండి జరిగే పీజీ రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలను ఇతర పోటీ పరీక్షలున్న దృష్ట్యా వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు అడ్మినిస్ట్రేషన్ కార్యాలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. పరీక్షలు వాయిదా వేయాలని కార్యాలయం ఎదుట భీష్మించుకు కూర్చున్నారు. చాలా రోజుల తరువాత వచ్చిన గ్రూప్ 2 నోటిఫికేషన్‌ని సద్వినియోగం చేసుకొనివ్వాలని కోరుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ హెూరెత్తించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ లోని పీజీ డిపార్ట్మెంట్‌ల విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ప్రత్యేకాధికారి



మొక్కను నాటుతున్న ప్రత్యేకాధికారి

నవతెలంగాణ-బాల్కొండ

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం వనమహెూత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని మల్లన్న గుట్ట వద్ద మండల ప్రజాపరిషత్ స్పెషల్ ఆఫీసర్ రసూల్ బి.ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వనమహెూత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి పలువురు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ ఇందిరా, పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బాల్కొండ పట్టణ అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, గ్రామ పెద్ద మనుషులు సల్ల నరసయ్య, తౌట్ గంగాధర్, ఆరేపల్లి నర్సయ్య అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

- మున్సిపల్ కమిషనర్‌కు వినతి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జిరయత్ నగర్ 1ఒకటో వార్డులో గత ప్రభుత్వము చేపట్టిన మిషన్ భగీరథ నల్లా నీళ్లు సమయానికి రావడం లేద నీ ఎమ్మార్పీఎస్ మాజీ పట్టణ అధ్యక్షులు ఇందారపు రాజు మాదిగ అన్నారు. మున్సిపల్ నల్ల ట్యాక్స్, ఇల్లు ట్యాక్స్, మాత్రం వసూలు చేస్తున్నారని తెలిపారు. మున్సిపల్ సిబ్బందిని అడిగితే "జలాల్పూర్" లో కరెంటు పోయినప్పుడు ట్యాంకులు నిండడం లేదని, జలాల్పూర్‌లో "జనరేటర్ సౌకర్యం" కల్పిస్తే సమయానికి నీరు అందిస్తామని మున్సిపల్ వాటర్ సెక్షన్ సిబ్బంది చెబుతున్నారని అన్నారు.

ఒకటో వార్డులో చెడిపోయిన బోర్లను, హ్యాండ్ పంపులను రీ ఫ్రెషింగ్ చేయించి, ట్యాప్‌లు బిగిస్తే నల్లా లు రాని సమయంలో బోర్ పంపులు ద్వారా నీటిని తీసుకునే అవకాశం ఉంది జిరాయత్ మాదిగ కాలనీ మహిళలు కోరుతున్నారు. సరైన సమయానికి నల్ల నీళ్ల రాకపోవడం వల్ల తమ పిల్లల్ని సరైన సమయానికి బడికి పంపలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా..ఈ నీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రాజు, మున్సిపల్ చైర్మన్ లావణ్య శ్రీనివాస్ నీటి సమస్యపై వినతి పత్రం ఇచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో, ఎస్సీ కాలనీ మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పిఎస్ నాయకులు

ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయురాలు



చిన్నారులకు చదువు చెపుతున్న టీచర్

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామం దుబ్బా ప్రాంతంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఒకే ఉపాధ్యాయురాలితో కొనసాగిస్తున్నారు. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు కొనసాగుతోంది. మొత్తం 32మంది విద్యార్థులు చదువుతుండగా శుక్రవారం 28 మంది విద్యార్థులు హాజరయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయుడు గంగాధర్ జూలై 2న బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో రావలసిన ఉపాధ్యాయులు ఇంకా ఎవరు బాధ్యతలు స్వీకరించలేదు. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయురాలు సరోజ మాత్రమే ఐదు తరగుతుల విద్యార్థులకు బోధిస్తున్నారు. ఒకవేళ ఈమె సెలవు పై వెళితే స్కూల్ పరిస్థితి ఏమిటో అధికారులే ఆలోచించాలి.

22 నుండి ఆందోళనలు

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్

నవతెలంగాణ-ఆర్మూర్

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీటిని వెంటనే అమలు చేయాలని ఈనెల 22 నుండి 29వ తేదీ వరకు మండల, జిల్లా కేంద్రాల్లో ఆందోళనకు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని, ఈ పిలుపులో ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొనాలని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్, డివిజన్ కార్యదర్శి దేవారాం తెలిపారు. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) డివిజన్ కార్యాలయం కుమార్ నారాయణ్ భవన్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేసి చూపిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఏడు మాసాలు గడుస్తున్న రేషన్ కార్డులకు అతీ గతీ లేదన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని కోరితే కోచింగ్ సెంటర్ల నిర్వాహకులే రెచ్చగొడుతున్నారని ఆరోపణ చేసి నిరంకుశంగా నిరుద్యోగ యువకులపై దాడులు చేస్తున్నారని గుర్తు చేశారు. రైతాంగానికి ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఆగస్టు 15వ డెడ్‌లైన్ లోపు కూడా అమలు జరిపే సూచనలు లేకుండా ప్రకటనలు చేస్తున్నారని అన్నారు.. 25 ఎకరాల వరకు ఉన్న రైతులకు 10 ఎకరాల వరకు పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండ్లు లేని వారికి ఇల్లు నిర్మించి ఇస్తామని, 100 గజాల స్థలం ఉన్న వారికి నిర్మాణానికి 5 లక్షల రూపాయల వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

వ్యవసాయ కార్మికులకు నెలకు వెయ్యి చొప్పున 12 వేల రూపాయల పెన్షన్ మర్చిపోయారని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్స్.. ఆరోగ్యశ్రీ బకాయిలు వెంటనే క్లియర్ చేస్తామన్న హామీ అమలుకాకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీకి పేదలకు సేవలు అందట్లేదని, వెంటనే వాటిని క్లియరెన్స్ చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్య పరిష్కరించాలని.. పోడు సాగు దారులకు రైతు భరోసా వర్తింపచేయాలని.. రైతులపై పెట్టిన కేసులు అన్నిటిని రద్దు చేయాలని.. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ 4016రూపాయలు పెన్షన్ వెంటనే ఇవ్వాలని.. ధరణి సమస్యలన్నిటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో ఈ నెల 22 నుండి 29 వరకు ఆందోళనకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. 28న మండల, డివిజన్ కేంద్రాల్లో 29న జిల్లా కేంద్రాల్లో జరిగే ఆందోళనలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ముత్తెన్న, కే. రాజేశ్వర్.. ఆర్మూర్ సంయుక్త మండలాల కమిటీ కార్యదర్శి కిషన్, ఐఎఫ్‌టియూ నాయకులు అరవిందు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- డాక్టర్ అజయ్ పవర్

నవతెలంగాణ-భీంగల్

వర్షాకాలం నీటి నిలువలపై దోమల లార్వాలు అభివృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా ఫైలేరియాసిస్ వంటి కీటక జనిత వ్యాధులు సంభవించే అవకాశం ఉందని, కనుక ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో నీటి విలువ లేకుండా చూసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అజయ్ పవర్ తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీజనల్ మార్పు వల్ల కలుషిత నీరు తాగడం వల్ల నీళ్ళ విరేచనాల వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది కనుక జాగ్రత్తగా ఉండాలని, వీలైనంత వరకు బయట ఆహారం తీసుకోకూడదని తెలియజేశారు. వర్షాల వల్ల నిలువ ఉన్న నీటిపై దోమలు గుడ్లు పెట్టేందుకు ఆవాసాలుగా మారుతాయి అని ఒకవేళ వాటిని తొలగించకపోతే దోమలు వృద్ధి చెంది అనేక వ్యాధులు కలిగిస్తాయని ఆయన వివరించారు. వయోజనులకు బీసీజీ టీకా వేయనున్నట్లు ఆయన తెలిపారు. గతంలో క్షయ వ్యాధితో బాధపడిన వారు, ప్రస్తుతం క్షయ వ్యాధి యొక్క కాంటాక్ట్‌లు, 60 సంవత్సరాల వయసు మించిన వృద్ధులు, తీవ్ర పోషకాహార లోపం కలవారు, ప్రస్తుత లేదా గత పొగ తాగే అలవాటు గలవారు, మధుమేహం చక్కెర వ్యాధితో బాధపడుతున్న వారు ఈ టీకాకు అర్హులని ఆయన వివరించారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వసంత్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ కటకం శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు భూలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి, పట్టుదల అవశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

లక్ష్య సాధనకు కృషి పట్టుదల అవశ్యం అని ఆక్స్ఫర్డ్ పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ అన్నారు. పట్టణ శివారులోని గాంధీనగర్ లో గల ఆక్స్ఫర్డ్ పాఠశాలలో నూతన విద్యార్థులను స్వాగతించేందుకు "ఫ్రెషర్స్ గాలా" కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరెస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి పట్టుదలతో సాధించుకోవాలని అన్నారు. విద్యార్థులను శారీరకంగా మానసికంగా భావపరంగా సామాజికంగా ఆధ్యాత్మికంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి సర్వదా కృషి చేస్తామని ఆయన అన్నారు. మా పాఠశాల పై నమ్మకంతో తమ పిల్లలను చేర్పించిన తల్లిదండ్రులు ఆశలను నెరవేర్చుటకు కృషిచేస్తామని ఆయన అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి జాతీయ అంతర్జాతీయ పోటీలకు ధీటుగా నిలబడేట్లు తయారు చేసి ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా పెట్టుకుని స్థాపించిన ఆక్స్ఫర్డ్ పాఠశాలను ఆదరిస్తున్న విద్యార్థులు తల్లిదండ్రులకు, విద్యార్థుల ఎదుగుదలకు అంకితభావంతో నిర్విరామ కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు సర్వదా కృతజ్ఞులుగా ఉంటామని ఆయన అన్నారు.

కార్యక్రమంలో పాఠశాల పాలనాధికారిని పద్మ మాట్లాడుతూ.. 3వ తరగతి నుండే విద్యార్థులకు ఒలంపియాడ్ పరీక్షలకు శిక్షణను ఇస్తున్నామని, అలాగే 6వ తరగతి నుండి ఐఐటీ నీట్ ఫౌండేషన్ కోర్సుకు శిక్షణను ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయేందుకు డిజిటల్ క్లాసులు సాంకేతిక విద్యకు పునాది వేసే కంప్యూటర్ క్లాసులు నిర్వహిస్తున్నామని ఆమె అన్నారు.

ఉపాధ్యాయులు నూతన విద్యార్థులను ఆశీర్వదిస్తూ ఆక్స్ఫర్డ్ పాఠశాల కుటుంబానికి ఆహ్వానం పలికారు. విద్యార్థులు ఆట పాటలతో నృత్యాలతో అలరించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు అందరిని ఆకట్టుకున్నాయి. వివిధ విభాగాల్లో నైపుణ్యం ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఫ్రెషర్స్ గాలా కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బిఎడ్ రెగ్యులర్ నాల్గవ సెమిస్టర్, బ్యాక్ లాగ్ పరీక్షల ఫీజు తేదీ ప్రకటన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బిఎడ్ నాలుగో సెమిస్టర్, 2020-21 విద్యా సంవత్సరం ఒకటవ, రెండవ, మూడవ, నాల్గవ సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షల ఫీజు 22 జూలై తేది లోపు చెల్లించాలని 100 రూపాయల అపరాధ రుసుంతో 23 జులై వరకు చెల్లించ వచ్చునని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగిందని తెలిపారు.

ఒకరు డిబార్..

డిగ్రీ వన్ టైమ్ ఛాన్స్ బ్యాక్ లాగ్ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం..

తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలోని వన్ టైం ఛాన్స్ (సిబిసిఎస్) బిఎ, బీకాం, బీఎస్సీ, బిబిఏ కోర్సులకు ఐదవ, ఆరవ సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్షలు 11వ రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజ్ నిజామాబాద్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డి, ఎస్ఆర్ఎన్‌కె గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ బాన్సువాడ, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆర్మూర్‌లో జరిగిన పరీక్షకు ఉదయం 111మంది విద్యార్థులకు 102 మంది విద్యార్థులు హాజరయ్యారు. 08 మంది విద్యార్థులు గైరాజరయ్యారు. కాగా గిర్రాజ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ లో (01) ఒకరు డిబార్ అయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 226 మంది విద్యార్థులకు 216 మంది విద్యార్థులు హాజరయ్యారని 10మంది విద్యార్థులు గైరాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేసి నాయకుడిగా ఎదిగే అవకాశాన్ని వినియోగించుకోవాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేసి నాయకుడిగా ఎదిగే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ ఎన్నికల అధికారి జెడ్ఆర్‌వో ప్రశాంత్ తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ భవనంలో విలేకరుల సమావేశం జిల్లా యోజన కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా విక్కీ యాదవ్ మాట్లాడుతూ.. యువజన కాంగ్రెస్ ఎన్నికల నోటిఫికేషన్ విడులైన సందర్భంగా ఎన్నికల అధికారి జెడ్ఆర్ఓ ప్రశాంత్ జిల్లాకి విచ్చేసి ఎన్నికల అవగాహన కల్పించారని అన్నారు. కావున యువజన కాంగ్రెస్ నాయకత్వ లక్షణాలు, రాజకీయాల్లో రాణించాలనుకునే యువతి యువకులు యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేసి నాయకుడిగా ఎదిగే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను ఉత్పత్తి చేసే ఒక కర్మాగారం అని ఈరోజు దేశంలో రాష్ట్రంలో ఉన్న ఎందరో గొప్ప గొప్ప నాయకులు యువజన కాంగ్రెస్ ద్వారానే రాష్ట్ర రాజకీయాల్లో ముఖ్య పాత్ర పోషిస్తున్నార న్నారు. కావున మండల, అసెంబ్లీ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీ చేసి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నవాజ్, రాష్ట్ర నాయకులు ముద్దసీర్, అదనాన్, మెయిన్, శుభం, పాల్గొన్నారు.



సన్మానించిన పలువురు

ఇంటింటా పూలు, పండ్ల మొక్కల పంపిణీ

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఇంటింటా పండ్లు, పూల మొక్కలను పంపిణి చేసినట్లు ఎంపిడిఓ బాలకృష్ణ తెలిపారు. ఫ్రైడే డ్రై డే సందర్భంగా అన్ని గ్రామాల్లో శానిటేషన్, చెట్ల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పరిసరాల పారిశుధ్యంపై ప్రజలు శ్రద్ధ వహించాలని అన్నారు. వర్షాకాలం విషజ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాజేష్, ఆయాగ్రామాల కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది, అంగన్వాడీలు, ఐకెపి సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో ఎంఆర్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఎం.విద్యాసాగర్ మాట్లాడుతూ.. మేడి పాపన్న నాయకత్వం వర్ధిల్లాలని, ఎమ్మార్పీఎస్ బలోపేతానికి మేడి పాపన్న ఎంతో కృషిచేశారని, మాదిగలందరూ ఐక్యమత్యంతో ముందుకు నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దేగం సాయిలు, ఎ.నగేశ్, బొర్ర సాయిలు, గోపు సాయిలు, దినేష్, కన్నం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

వికలాంగుల సంఘం అధ్యక్షులుగా ఈశ్వర్

నవతెలంగాణ-బోధన్

మండలం పెంటాఖుర్దు, పెంటాఖుర్దు క్యాంపు గ్రామాలలో ఎన్‌పిఆర్‌డి వికలాంగుల సంఘం సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పెంటాఖుర్దు గ్రామ అధ్యక్షుడిగా ఈశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శిగా సాయినాథ్, కోశాధికారిగా పద్మ ఉపాధ్యక్షులుగా హరిప్రియ, సహాయ కార్యదర్శిగా గంగారం పటేల్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు దేశాల గంగాధర్, రాములు, సాలూరు మండల అధ్యక్షులు షేక్‌నజీర్, సాలూర మండల నాయకులు గిజ్జి ఎల్లయ్య, లక్ష్మి, సరస్వతి, అనిత, రాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికైన ఎన్‌పీఆర్‌డీ సంఘం సభ్యులు

పరిసరాల అపరిశుభ్రతతోనే వ్యాధులు

- నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పరిసరాల అపరిశుభ్రత వలనే సీజనల్ వ్యాధులు వస్తానని నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని 14వ డివిజన్ డెయిరీ ఫామ్ ప్రాంతంలో ఇటీవలే డెంగ్యూ వ్యాధి బారిన పడిన కుటుంబాన్ని మేయర్ దండు నీతూ కిరణ్, డిప్యూటీ మేయర్ ఇద్రిస్ ఖాన్, మున్సిపల్ కమిషనర్ మకరంద్, డిప్యూటి కమిషనర్ రాజేంద్ర కుమార్ కలిసి పరామర్శించారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా 14వ డివిజన్ డైరీ ఫామ్ ప్రాంతంలో పర్యటించి ప్రజలకు సీజనల్ వ్యాధుల వ్యాప్తి, వర్షాకాలంలో విష జ్వరాలపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు చుట్టు పరిసరాలను శుభంగా ఉంచుకోవాలని ఇంట్లో, ఇంటి చుట్టు పక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. డెంగ్యూ వ్యాధి శుభ్రమైన నీటిలో పెరిగే దోమకాటు వల్ల వస్తుందని కావున ప్రజలు ఎక్కువ రోజులునీరు నిలువ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. ఎవరైనా వ్యాధుల బారిన పడినట్లైతే స్థానిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేసి మందులు అందించటం జరుగుతుందని అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో నుండి తీసుకోవలసిన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ ఇద్రీస్ ఖాన్, మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్, డిప్యూటి కయిుషనర్ రాజేంద్ర కుమార్, అర్సపల్లి ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి సామ్రాట్, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న మేయర్

నేడు పోచారం రాక

నవతెలంగాణ-కోటగిరి

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఉదయం 11గంటలకు కోటగిరి మండల కేంద్రంలోని ఎత్తొండ రోడ్డున గల ఏఎస్ ప్యాలస్ ఫంక్షన్‌హాల్‌లో మాజీ జడ్పిటిసి శంకర్ పటేల్ పదవి విరమణ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొననున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు షాహిద్ హుస్సేన్ తెలిపారు. అనంతరం ఉమ్మడి మండలానికి చెందిన 91 మంది లబ్ధిదారుల కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులు, 22 సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ డిసిసిబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

మహారాష్ట్ర సరిహద్దులో ఏటీఎం లభ్యం

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని ఎస్బీఐ వద్ద గల ఏటీఎం మిషన్‌తో సహా ఎత్తుకెళ్లిన దుండగులు జుక్కల్ మండలం సరిహద్దు గ్రామం గుల్లా తాండా దగ్గర మహారాష్ట్ర సరిహద్దు వద్ద క్వాలీస్ వాహనం వదిలివెళ్లారు. ఎస్సై సత్యనారాయణ, బిచ్కుంద ఎస్సై మోహన్‌రెడ్డి రెండు బృందాలుగా ఏర్పడి సరిహద్దు గ్రామాలలో గాలింపు చర్యలు చేపట్టారు. మండలంలోని పెద్దగుల్లా గ్రామ శివారులో ఈద్గా వెనుకాల చిందవందరగా పడేసి ఎటిఎంలో డబ్బులు దాచే చెస్ట్ మిషన్‌ను ఎత్తుకెళ్లారు. మండలంలోని పెద్దఎడ్గి గ్రామం నుంచి ఎత్తుకెళ్లిన రెండు బైకుల ఆచూకీ పోలీసులకు దొరకలేదని గురువారం ఏటీఎం మిషన్ పైభాగం లభ్యమైందని సిఐ నరేష్ తెలిపారు. ఏటీఎం మిషన్ దొంగతనం చేసిన దుండగుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేస్తామని త్వరలోనే చోరికి పాల్పడిన వారిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

బైక్, ట్రాక్టర్ ఢీ.. వ్యక్తి మృతి

నవతెలంగాణ-జుక్కల్

ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చిన్నఎడ్గి వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లాడేగాం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు బస్వాపూర్‌లో వ్యవసాయ పనుల నిమిత్తం కూలీకి వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం ట్రాక్టర్ చిన్నఎడ్గి గ్రామం మీదుగా లాడేగాం గ్రామానికి వెళ్తున్న క్రమంలో ఎదురుగా బైక్‌పైన వస్తున్న సురేష్(43) ఎదురెదురుగా బలంగా ఢీకొట్టడంతో చిన్నఎడ్గి గ్రామానికి చెందిన వ్యక్తి సురేష్ అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు.


సురేష్ మృతదేహం

జర్నలిస్టులపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలి

- తెలంగాణ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కాట్యాడ బాపూరావు

నవతెలంగాణ-కామారెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీలో నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనను కవరేజ్, చేసేందుకు వెళ్లిన శ్రీ చరణ్ జి టీవీ ప్రతినిధి, కెమెరామెన్ సాగర్లపై పోలీసులు దాడి చేసి కొట్టడాన్ని ఖండిస్తున్నామని తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాపూరావు ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్ట్‌లపై దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. ఇలాంటిది పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని, జర్నలిస్టులకు అక్కడక్కడ బెదిరింపులకు గురిచేస్తున్నటువంటి నాయకులపై, అధికారులపై చర్యలు తీసుకోని న్యాయం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఈ సందర్భంగా కోరుతున్నామని తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండే జర్నలిస్టులపై దాడి చేయడం బెదిరింపులు గురి చేయడమే మళ్ళీ జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి దృష్టి పెట్టి జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు.

పేపర్ బ్యాగులను వాడుదాం

- ఐయస్ఆర్‌డి స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి అమృత రాజేందర్

నవతెలంగాణ-కామారెడ్డి

పేపర్ బ్యాగుల వాడకం లక్ష్యంగా పెట్టుకుందామని ఐఎస్ఆర్‌డి స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి అమృత రాజేందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోజును పేపర్ బ్యాగ్‌ల వాడకాన్ని ప్రోత్సహించడం, ప్లాస్టిక్ బ్యాగ్‌లను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకోవాలని ఈ సందర్భంగా తాము ప్రజలకు చూపిస్తున్నామన్నారు. పేపర్ బ్యాగ్‌లు పర్యావరణానికి మేలు చేస్తాయి, అవి పునర్వినియోగపరచడానికి సులభం, వృక్ష సంబంధిత వస్తువులతో తయారు చేయబడతాయి, అవి భూమిలో సులభంగా కలసిపోతాయన్నారు. ప్రతి ఒక్కరూ పేపర్ బ్యాగ్‌ల వాడకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాలు

నవతెలంగాణ-మద్నూర్

ఉమ్మడి మద్నూర్ మండలంలోని నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండలంలోని లింబూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన ఐదుగురు బదిలీ అయ్యారు. కాగా ఈ ఐదుగురు ఉపాధ్యాయులకు ఈ పాఠశాలకు హెచ్ఎంగా కొత్తగా వచ్చిన మారుతితో పాటు అలాగే ఆ గ్రామ పెద్దలు కలిసి వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ పెద్దలు బాబు పటేల్, రామ్ పటేల్, మధుకర్ పటేల్, రగొత్తం పటేల్, మధు విట్టల్ పటేల్ మాట్లాడుతూ.. మా గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయులుగా సేవలందించిన ఐదుగురు టీచర్లు వారి సేవలు అమూల్యమైనవి అని పేర్కొన్నారు ఈ పాఠశాలకు కొత్తగా వచ్చిన మారుతి సార్ మాట్లాడుతూ లింబూర్ గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు గ్రామపెద్దలు సహకారం మరువలేనివని తెలిపారు. ఈ పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు పి.యాదవరావు, వి.భీమ్‌సింగ్, వి.సాయినాథ్, జి.హనుమంతరావు, శ్రీపద్ ఈ ఐదుగురికి ఆ గ్రామ పెద్దలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోటి ఉపాధ్యాయులు శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని హున్సా గ్రామంలో శుక్రవారం సొసైటీ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు నగేష్, ఆతీఫ్, శంకర్, వనిత ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అలాగే పాఠశాల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని నిగేశ్వరిని సన్మానించి 5000ల నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మంధర్నా రవి, ఉపాధ్యక్షులు వినోద్ రావు, డైరెక్టర్లు గుమ్మడి భూమన్న, మర్కల్ శివకుమార్, మురిగే మాధవరావు, సీతఊట హన్మంత్‌రావు, మాజీ సర్పంచ్ చీల గంగామణి గంగారాం, మాజీ ఎంపీటీసీ శంకర్ చీల, మాజీ ఎంపీటీసీ శివకుమార్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మురిగే శంకర్, ఈరయప్ప మహారాజ్, మర్కల్ శివ పటేల్, షికారి నారాయణ, నాని, చాప్రే నాగనాథ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

దాశరథి 99వ జయంతి సభను విజయవంతం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజాకవి దాశరధి కృష్ణమాచార్య 99వ జయంతి సభలను ఈ నెల 21న టీఎన్జీవోస్ భవన్ నిజామాబాద్‌లో నిర్వహిస్తున్నట్టు జయంతి నిర్మాణ కమిటీ పాత్రికేయుల సమావేశంలో ప్రకటించారు. శుక్రవారం మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవన్లో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దారం గంగాధర్ మాట్లాడుతూ.. ప్రజా కవి దాశరథి తెలంగాణ ప్రజల హృదయాల్లో పదిలంగా ఉన్నారని, తెలంగాణ కోసం నిలుబంధాన్ని నిర్భయంగా వ్యతిరేకించి రచనలు చేశారని ఆయన వివరించారు. సిర్ప లింగం ఓ నిజాము పిశాచమా, కానరాడు నిన్ను పోలిన రాజు మాకెన్నడేని.. తీగలను తెంపి అగ్నిలోదింపినావు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ తెలంగాణ సమాజ అస్తిత్వాన్ని ఎలుగెత్తి చాటిన మహాకవి అని ఆయన అన్నారు. దాసు మాట్లాడుతూ.. నిజాం నవాబ్ రక్కసి పాలనపై కన్నెర చేశారని ఆయన తెలిపారు. తెలంగాణ బిడ్డలను చైతన్య సైన్యంగా మార్చి, తెలంగాణ సాయుధ పోరాటానికి చేయూతనిచ్చారని దాశ రథిని కొనియాడారు. నిజామా బాద్ నగరంలో టీఎన్జీవోస్ భవన్‌లో ఈనెల 21న జరిగే దాశరధి కృష్ణమాచార్య సభలో ప్రజావాగ్గేయ కారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని ఆయన తెలిపారు. కవులు, కళాకారులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. సమావేశంలో సాయిబాబా ఇందూర్ యువత, చంద్రశేఖర్, పిడిఎస్యు రాజేశ్వర్, రాధా కిషన్, నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కవులు

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-ఆర్మూర్

న్యాయవాది రవికుమార్‌పై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం పట్టణ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన పోలీసు అధికారులను విధుల నుంచి వెంటనే డిస్మిస్ చేయాలని న్యాయవాదుల సంరక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, కోర్టు విధులను బహిష్కరించరు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పోడేటి శంకర్, ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి అరుణ్ కోశాధికారి తుమ్మ సుకేష్, గ్రంథాలయ కార్యదర్శి సురేష్ సీనియర్ న్యాయవాదులు నరేందర్, శ్రీధర్, కృష్ణంరాజు, కీర్తి సాగర్, దాస్‌బాబు, జిజి రాం, నరేష్, బాబాగౌడ్, కార్తీక్, సంజీవ్, శ్రీకర్, తదితరులు పాల్గొన్నారు.



చదువుతోపాటు క్రీడలూ అవసరమే

- స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థుల జీవితంలో చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమని, క్రీడల్లో గెలుపోటములు సహజమని స్టేషన్‌హౌస్ ఆఫీసర్ రవికుమార్ విద్యార్థులనుద్దేశించి అన్నారు. పట్టణంలోని విజయ్ హైస్కూల్ మామిడిపల్లిలో ఇంట్రామ్యూరల్ గేమ్స్, స్పోర్ట్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులందరూ చదువుపై ఎక్కువ శ్రద్ధ వుంచి సమయమున్నప్పుడు ఆటలు కూడా ఆడుకోవాలని, మార్చ్‌ఫాస్ట్‌ని చూడగానే ఎంతో సంతోషం కలిగిందనీ, చక్కగా మార్చ్‌ఫాస్ట్ చేసిన విద్యార్థులను అభినందించారు. విశిష్ట అతిథిగా వచ్చిన సబ్ ఇన్‌స్పెక్టర్ అశోక్ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ ఉపయోగం వల్ల విద్యార్థులకు కలిగే నష్టాలను వివరించి ఈరోజుల్లో జరుగుతున్న మోసాలను తెలియచేశారు. విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఏవాహనాన్ని నడపకూడదని, ఏదైనా జరగరానిది జరిగితే వారితో పాటు వరి తల్లిదండ్రులు కూడా శిక్షకు గురవుతారని తెలిపారు. కార్యక్రమంలో విజయ్ విద్యాసంస్థల అధినేత డా.అమృతలత, ప్రధానోపాధ్యాయురాలు టి.కవిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


బొకే ఇచ్చి ఆహ్వానిస్తున్న విద్యార్థులు

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడికి సన్మానం


బదిలీ అయిన ఉపాధ్యాయున్ని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు, పిఆర్‌టియు మండల ప్రధాన కార్యదర్శి సాయిరెడ్డికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయ బృందం శుక్రవారం ఘనంగా సన్మానించారు. గత 19 సంవత్సరాలుగా రెంజల్ మండలానికి అనేక సేవలను అందించిన సాయిరెడ్డి సేవలను మండల ప్రజలు కొనియాడారు. దీర్ఘకాలికంగా పనిచేసిన ఆయన ఎడపల్లి మండలం పోచారం గ్రామానికి బదిలీ కాగా మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావుతో పాటు ఉపాధ్యాయ బృందం ఆయనకు శాలువాలు కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు బి.వెంకటలక్ష్మి పిఆర్టియు మండల అధ్యక్షులు సోమలింగం గౌడ్, ఉపాధ్యాయులు కృష్ణ, లక్ష్మీ దేవమ్మ, సాయన్న, రాజేశ్వర్, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ బాబన్న ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే సప్లై చేయాలి

- ఏఐటీయుసి జిల్లా నాయకులు విటల్‌గౌడ్

నవతెలంగాణ-కోటగిరి

గత ఐదు నెలల నుంచి బిల్లులు రాక మధ్యాహ్న భోజన కార్మికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మధ్యాహ్న భోజనం పెట్టే సమయంలో కావాల్సిన నిత్యావసర వస్తువులన్నీ ప్రభుత్వమే సరఫరా చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎ.విటల్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల విద్యా వనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షురాలు రమణమ్మ, ఉషారాణి, వీరేశం, అలీ, భూమయ్య కార్మికులు పాల్గొన్నారు.

కోటగిరి లయన్స్‌క్లబ్ అధ్యక్షులుగా జానకిరామ్

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి లయన్స్‌క్లబ్ 2024-25 సంవత్సరానికి గానూ అధ్యక్షులుగా శుక్రవారం బోధన్ లయన్స్‌క్లబ్ భవనంలో జరిగిన సమావేశంలో అధ్యక్షులుగా వై.జానకిరావు, కార్యదర్శిగా పత్తి లక్ష్మణ్, కోశాధికారిగా ఎస్.సాయి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జానకిరావు మాట్లాడుతూ.. క్లబ్ అభివృద్ధికి, సమాజ సేవకు ముందు ఉంటామని పేర్కొన్నారు. మాజీ డిస్టిక్ గవర్నర్ బసవేశ్వరరావు శాలువాతో సన్మానించి సభ్యులకు అభినందనలు తెలిపారు.


సభ్యులను సన్మానించిన మాజీ డిస్టిక్ గవర్నర్

ఉరేసుకుని యువకుని ఆత్మహత్య

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మల్లూర్ గ్రామంలో అడ్డగళ్ల సాయిలు(20) అనే యువకుడు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సాయిలు ఇంటర్ వరకు చదువుకొని కొన్ని రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లి ఓ కంపెనీలో నెల రోజుల పాటు పని చేశాడు. తిరిగి గ్రామానికి వచ్చాడు. ఇంటికి వచ్చిన తర్వాత ఏం చేయాలో అర్థం కాక జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి అందరూ పడుకున్న తర్వాత గ్రామ పొలిమేర శ్మశాన వాటికలోకి వెళ్లి చెట్టుకి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి సంజీవులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమే

- వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి


మేనేజర్లను సన్మానిస్తున్న మల్కారెడ్డి, తదితరులు

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రభుత్వ వివిధ శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి బదిలీలు సహజమేనని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న మేఘన, వెంకటేష్‌లు బదిలీ అయ్యారు. మేఘన నిర్మల్ జిల్లాకు బదిలీ కాగా, వెంకటేష్ నిజామాబాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు బదిలీ అయ్యారు. శుక్రవారం ఇరువురు అధికారులను తెలంగాణ గ్రామీణ బ్యాంకులో సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, అబ్దుల్ వాహెబ్ భారీ, నాయకులు రైతులు వారిని ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. సన్మాన కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ క్యాషియర్ దివ్య, ఎడపల్లి, రైతులు బంజ కామప్ప, కృష్ణారెడ్డి, గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని రాకాసిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జెసి) హైస్కూల్లో పనిచేసి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్ళిన ఉపాధ్యాయులను శుక్రవారం పాఠశాల హెచ్ఎం బాలచంద్రం, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బదిలీపై వెళ్లడం ప్రతి ఉద్యోగికి సర్వసాధారణమని, కావున ఎక్కడ పని చేసిన మంచి గుర్తింపు పొందాలని ఆయన పేర్కొన్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు మీరు అందించిన సేవలను మర్చిపోలేమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

టై, బెల్టులు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మగ్గిడి గ్రామ వాస్తవ్యులు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ డి ఈ ఈ కదురుగంటి భూమన్న 12000 విలువైన 300 టై బెల్ట్ లు అందజేయడం జరిగింది అని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హరిత శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుమలత నర్సయ్య ఉపాధ్యాయులు గంగాధర్, సురేష్ వ్యాయామ, ఉపాధ్యాయులు మధు, తదితరులు పాల్గొన్నారు.